అధికారుల అత్యుత్సాహం బాధాకరం

- మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 10: బీజేపీ నాయకుడు నాగుల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం బాధాకరమని మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తన బిల్డింగ్ అక్రమమంటూ బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. తాను సిరిసిల్లలో అందుబాటులో లేని సమయంలో మున్సిపల్ అధికారులు తన బిల్డింగ్ సెల్లార్‌లోని షట్టర్లను ధ్వంసం చేసి నానా హంగామా చేశారని ఆరోపించారు. మున్సిపల్‌కు సంబంధించిన డ్రైనేజీని సైతం కూల్చివేశారన్నారు. సెల్లార్‌ను కమర్షియల్‌గా వాడుతున్నట్లు కోర్టు పరిధిలో కేసు నడుస్తున్నదని, దీనిపై ఎటువంటి తీర్పు వెలువడలేదన్నారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పుకునే బాధ్యత తనపై ఉన్నదన్నారు. 2004లో మున్సిపల్ అనుమతితో నిర్మాణం చేశామని, ఇందుకు సంబంధించిన ఆస్తి పన్ను మున్సిపల్‌కు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సెల్లార్‌ను కమర్షియల్‌గా మార్చుకుని సంబంధిత పన్ను సైతం చెల్లిస్తున్నట్లు తెలిపారు. అధికారుల అత్యుత్సాహంపై తాను కోర్టు ద్వారా సమాధానం చెబుతానన్నారు. నాగుల శ్రీనివాస్ అనవసరంగా తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడన్నారు. అతడు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీజేపీని అడ్డుపెట్టుకుని మున్సిపల్, కలెక్టరేట్‌లో ఆర్టీఐ దరఖాస్తులు పెడుతూ బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ఇటువంటి వ్యక్తికి పదవి ఇచ్చి బీజేపీ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. గతంలో నాగుల శ్రీనివాస్ తన వద్ద రూ.5లక్షలు తీసుకున్నాడని, తరువాత కాలంలో డబ్బులు తిరిగి చెల్లించకుండా వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. తన పరువుకు నష్టం కలిగించిన శ్రీనివాస్‌పై చట్టపరంగా, న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దార్ల సందీప్, సుంకపాక మనోజ్‌కుమార్, లింగంపల్లి సత్యనారాయణ, అన్నారం శ్రీనివాస్, సత్తార్, మ్యాన రవి, అడ్డగట్ల మురళి, బుర్ర మల్లికార్జున్‌గౌడ్, పోచవేని ఎల్లయ్యయాదవ్, పొరండ్ల రమేశ్, మునీర్, కత్తెర వరుణ్, సాయి, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడుపాలి

వీర్నపల్లి, సెప్టెంబర్ 10: విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడుపాలని సిరిసిల్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్ మంగళవారం వినతిపత్రం అందించారు. బస్సుల్లో ప్రయాణికుల రద్దీ వల్ల డ్రైవర్లు బస్సులు ఆపడం లేదన్నారు. దీంతో విద్యార్థులు తరగతులు మిస్ అవుతున్నారని పేర్కొన్నారు. అడవి పదిరకు ప్రత్యేక బస్సు నడిపించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

రేషన్‌డీలర్లకు నోటిఫికేషన్

- కేవలం సిరిసిల్లలోనే విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించక పోవడంపై అనుమానాలు
- బీఆర్ఎస్ నాయకులే టార్గెట్‌గా కక్షసాధింపు చర్యలు
- కోర్టును ఆశ్రయించిన పలువురు డీలర్లు

సిరిసిల్లరూరల్, సెప్టెంబర్ 10: ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ డీలర్ల నోటిఫికేషన్ వేసి, మహిళా సంఘాలకు షాపులను కేటాయించింది. తర్వాత స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కారు ఈ ప్రక్రియను కొనసాగించింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటిఫికేషన్ వేసింది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కేవలం సిరిసిల్ల నియోజవర్గంలోని 58దుకాణాలకే ప్రకటన విడుదల చేయడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్కసుతోనే నోటిఫికేషన్ జారీ చేసిందని, డీలర్లలో చాలామంది బీఆర్ఎస్ నేతలే ఉండడంతోనే కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

ఆగస్టు 29న నోటిఫికేషన్

గత ఆగస్టు 29న సిరిసిల్ల ఆర్డీవో నోటిఫికేషన్ విడుదల చేశారు. సిరిసిల్ల డివిజన్ పరిధిలోని సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్‌తోపాటు ఇల్లంతకుంట మండలాల్లో 58 రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కేవలం సిరిసిల్లలోనే నోటిఫికేషన్ ఇవ్వడం గమనార్హం. ఈ నెల 15న రాత పరీక్ష, తర్వాత ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక విధానం ఉంటుందని ప్రకటించారు.

మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్కసుతోనే..

మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్కసుతోపాటు అధికంగా బీఆర్ఎస్ కార్యకర్తలు డీలర్లుగా ఉన్నారనే నెపంతోనే నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలుస్తున్నది. బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ నోటిఫికేషన్ వేసినట్లు ప్రచారం జరుగుతున్నది. పలువురు కాంగ్రెస్ నేతలు నిర్వహిస్తున్న దుకాణాలకు కూడా నోటిఫికేషన్ వేయడంతో వారంతా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నట్లు సమాచారం. అయితే నోటిఫికేషన్‌పై పలువురు రేషన్‌డీలర్లు హైకోర్టును ఆశ్రయించారు. దశాబ్దాల కాలంగా రేషన్ దుకాణాలు నిర్వహిస్తున్నామని, సమాచారం, నోటీస్‌లు లేకుండా తమ దుకాణాలు నోటిఫికేషన్ ఇవ్వడంపై న్యాయపోరాటంకు దిగారు. త్వరలోనే స్టే ఆర్డర్ వస్తుందని వారంతా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కక్షపూర్తితంగా వ్యవహరించడం సరికాదని ఆ పార్టీకి చెందిన డీలర్లు వాపోతున్నారు.

రేషన్ దుకాణాల డీలర్ల నియామకాలకు 830 దరఖాస్తులు

- ఆర్డీవో రమేశ్ కుమార్
- ఈనెల 15న అభ్యర్థులకు రాత పరీక్ష

కలెక్టరేట్, సెప్టెంబర్ 10: సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణ డీలర్ల నియామకాలకు 830 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో రమేశ్ కుమార్ వెల్లడించారు. డివిజన్ పరిధిలోని మండలాల్లోని గ్రామాల్లో డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీచేయగా ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. కాగా డీలర్ల నియామకానికి రాత పరీక్ష ఈనెల 15న ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సిరిసిల్ల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష హాల్ టికెట్లు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను తహసీల్దార్ కార్యాలయాల నుంచి పొందాలని ఆయన కోరారు.

పోరాట ఫలితంగానే నేతన్నలకు ఉపాధి ప్రకటన

- వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

మాట్లాడుతున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : వస్త్ర పరిశ్రమలోని అనుబంధ సంఘాల జేఏసీ పోరాటాల ఫలితంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతన్నలకు ఉపాధి ప్రకటన చేశారని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సోమవారం హైదరాబాద్‌లో జరిగిన చేనేత సభలో సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల ఉపాధి నిమిత్తం కోటీ 30 లక్షల చీరలు దాదాపు 8కోట్ల పైచిలుకు మీటర్ల ఆర్డర్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ నిర్ణయం కార్మికులకు ఉపయోగపడాలంటే వర్క్ టూ ఓనర్ పథకంలో భాగంగా పెద్దూరులోని లివింగ్ పార్కు గ్రూపు వర్క్ షెడ్లలో లూమ్స్ వేయించి కార్మికులకు అందిస్తే మేలు జరుగుతుందన్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ బాధ్యత తీసుకొని ఆర్డర్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, నక్క దేవదాస్, బెజుగం సురేశ్, స్వర్గం శేఖర్, బింగి సంపత్, సందుపట్ల పోచమల్లు తదితరులున్నారు.

24 గంటల్లో చోరీ నిందితుల పట్టివేత

- ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, దొంగతనం చేసిన బంగారం

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 10: బంగారం దొంగతనం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ రూరల్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీనివాస్ తన ఇంటి పునరుద్ధరణలో భాగంగా ఇంటికి కలర్ వేయడానికి వేములవాడకు చెందిన నందెల్లి అనిల్‌కుమార్, సయ్యద్ అఫ్రోజ్‌ను కలిసి కలర్ వేయడానికి ఒప్పందం కుదుర్చున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న శ్రీనివాస్ తన భార్యతో కలిసి బెజ్జంకి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో హ్యాండ్ బ్యాగ్, అందులోని 25 గ్రాముల బంగారం కనిపించట్లేదని వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ మారుతి, పోలీస్ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేశారు. ఇంటికి కొద్ది దూరంలో బ్యాగ్ కనిపించగా ఆ బ్యాగ్ పై కలర్ మరకలు ఉన్నాయి. ఇంటికి కలర్ వేయడానికి వచ్చిన అనిల్‌కుమార్, అఫ్రోజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేశామని చెప్పడంతో బంగారం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఇద్దరని రిమాండ్‌కు తరలించినట్లు ఆమె వెల్లడించారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే దొంగతనం కేసును ఛేదించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి, పోలీస్ సిబ్బంది తిరుపతి, శంకర్, యాకుబ్, రాజశేఖర్, వెంకటేశ్‌ను ఏఎస్పీ అభినందించారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

చిప్పలపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ యూత్ సభ్యులు

ముస్తాబాద్, సెప్టెంబర్ 10 : రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షల పేరుతో రైతులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలతో వినూన్న నిరసన తెలిపారు. మండలంలోని చిప్పలపల్లిలో బీఆర్ఎస్ యూత్ గ్రామాధ్యక్షుడు గాడిచెర్ల భరత్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఇక్కడ పార్టీ యూత్ రాష్ట్ర నాయకుడు మెంగని మనోహర్, మాజీ సర్పంచ్ తాడెపు ఎల్లం, యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్మెట రాజమల్లు, ఎండీ జహంగీర్, వంగూరి దిలీప్, పోతారం సతీశ్, మల్లారెడ్డి, దేవరాజు, నాయకులు హనుమయ్య, గట్టయ్య, రమేశ్, లింగంస్వామి, శ్రీకాంత్, విజయ్, రాకేశ్, చందు, దేవరాజ్, అనిల్ ఉన్నారు.

ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 10: ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి పథానికి దోహదపడుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెడికల్ కాలేజీలో తంగళ్లపల్లికి చెందిన మార్కండేయ మహిళా సమాఖ్యకు మంజూరైన రూ.3 లక్షల రుణంతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన థాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. థాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు

ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తల నొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే

రిజర్వేషన్లు రద్దు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్